క్లుప్తంగా

నరసన్ననగర్ పార్కుకు సిమెంట్ బెంచీల బహూకరణ



కాకినాడ నరసన్ననగర్ పార్కులో ఏర్పాటు చేసిన బెంచ్‌లు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ డివిజన్ ఆధ్వర్యంలో కాకినాడ నరసన్న నగర్ పార్కులో సందర్శకుల కోసం బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ దివంగత నల్లమిల్లి పద్మావతి జ్ఞాపకార్థం తమ క్లబ్ కార్యదర్శి నల్లమిల్లి శ్రీదేవి రెడ్డి బెంచ్‌లు సమకూర్చారన్నారు. కార్యక్రమంలో శ్రీవాణి, రమాసుందరి, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం



కోరమాండల్ కర్మాగారంలో ప్రసంగిస్తున్న యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ తనిఖీ అధికారి శాంతారావు, కోరమాండల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో విద్యుత్ పొదుపు, విద్యుత్ వలన ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన చర్యలపై శాంతారావు, కోరమాండల్ ఎలక్ట్రికల్ హెడ్ గంగాధర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ పద్మనాభం, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నూకరాజు, తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యుత్ భద్రతపై నిర్వహించిన పోటీ పరీక్షల విజేతలకు బహుమతులు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటాలని బీజేపీ కాకినాడ సిటీ అసెంబ్లీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ నెల 6 వరకూ అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక 28, 29 డివిజన్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల రెండు నుంచి నగరంలోని పలు డివిజన్లలో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొడ్డి వీరేంద్ర, బీరక అప్పారావు, గొల్లపల్లి శివ, కె. రాజ్‌కుమార్, వెంకట చక్రధరరావు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాస అమావాస్యను పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్ పూజా కార్యక్రమాలు చేశారు.

ట్రాఫికర్ లేకుండా..

- ఆరు నెలలుగా తగ్గిన అతిక్రమణలు
- ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో గణనీయమైన తగ్గుదల
- ఫలిస్తున్న సదస్సులు, కౌన్సెలింగ్‌లు

కాకినాడ క్రైం: కాకినాడ ట్రాఫిక్ విభాగం శ్రమ ఫలిస్తోంది. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ హనుమంతరావు సూచనలతో ట్రాఫిక్-1, 2 సీఐలు ఎస్.రమేష్, డీఎస్ చైతన్యకృష్ణల బృందం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ అతిక్రమణలు గణనీయంగా తగ్గాయి. ఈ ఫలితాలపై సీఐలు వారి బృందాలు ఉన్నతాధికారుల మన్ననలు పొందాయి.

సత్ఫలితాలిస్తున్న సదస్సులు

ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని గుర్తించిన పోలీసు యంత్రాంగం ఎస్పీ సూచనలతో ఆరు నెలలుగా సదస్సులు నిర్వహిస్తున్నారు. గృహస్తుల నుంచి ఆటో, లారీ చోదకుల వరకు విద్యార్థుల నుంచి మహిళల వరకు అందరికీ ట్రాఫిక్ నిబంధనలను, అతిక్రమిస్తే ఎదుర్కోవలసిన పర్యవసనాలపై అవగాహన కల్పించారు. కాకినాడ ట్రాఫిక్-1 సీఐ రమేష్, ట్రాఫిక్-2 సీఐ చైతన్య కృష్ణల పర్యవేక్షణలో ట్రాఫిక్ విభాగం బృందాలుగా ఏర్పడి ఈ సదస్సులు నిర్వహిస్తోంది. ఆటో పార్కింగ్ జోన్లు, జన సమ్మర్దత అధికంగా ఉండే బస్‌స్టాండ్ ఇతర ప్రాంతాలు, విద్యాలయాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించడం సత్ఫలితాలనిస్తోంది.

ఆటో డ్రైవర్లకూ కౌన్సెలింగ్

నగరంలో వందలాదిగా ఉన్న ఆటో డ్రైవర్లను సైతం పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ ఆటంకాలు, నిబంధనల అతిక్రమణపై వారికి సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఆటో స్టాండ్‌ల వారీగా అవగాహన సదస్సులు, అతిక్రమిస్తే తీసుకునే చర్యలు, జరిమానాలు తదితర అంశాలపై స్పష్టతనిస్తోంది. సామాన్య ప్రయాణికులు ముగ్గురు, స్కూల్ విద్యార్థులు ఆరుగురికి మించి ఆటోలో ఎక్కించకూడదన్న నిబంధనను అమలు చేయాలని అధికారులు ఆదేశించారు.

స్పష్టమైన మార్పు

ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉల్లంఘనుల్లో స్పష్టమైన మార్పు వచ్చింది. ఎక్కడికక్కడ బీట్లు పెట్టి జల్లెడ పట్టడం సత్ఫలితాలనిచ్చింది. కేసుల నమోదులో కఠినంగా వ్యవహరించడం, సిఫార్సులు, విన్నపాలకు తావివ్వకుండా ప్రజల భద్రతే ధ్యేయంగా ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడం, మందుబాబులతో పాటు స్పీడ్ డ్రైవర్లు, ట్రిపుల్ రైడర్లలో మార్పు తీసుకువచ్చినట్టు పోలీసులు తెలిపారు.

స్టిక్కర్లపై కొరడా...

పోలీస్, ప్రెస్, న్యాయవాది అంటూ స్టిక్కర్లు అంటిస్తూ ట్రాఫిక్ నిబంధనల నుంచి మినహాయింపు పొందాలని యత్నించిన వారి ఆటలు గత కొన్నాళ్లుగా పోలీసులు సాగనివ్వడం లేదు. వారి వాస్తవికతను నిర్ధారించుకునేందుకు ఐడీ కార్డులు చూపమని కోరుతూనే ఎవరికైనా నిబంధనలు ఒక్కటేనని స్పష్టం చేస్తున్నారు. వారి తప్పిదాలు మరో మారు పునరావృతం కాకుండా ముక్కు పిండి జరిమానాలు వసూలు చేస్తున్నారు.

కేసులు తగ్గుముఖం..

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తున్న వారిలో బాధ్యత కనపడే దిశగా ట్రాఫిక్ విభాగం చేపడుతున్న చర్యలు సఫలీకృతం అవుతున్నాయి. గణనీయంగా తగ్గిన కేసుల సంఖ్యే ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. గతేడాదితో ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరు నెలల గణాంకాలను పరిశీలిస్తే..

నెల	2023లో	2024లో
జనవరి	2945	2307
ఫిబ్రవరి	1958	1888
మార్చి	2102	1802
ఏప్రిల్	2450	1605
మే	2958	1785
జూన్	2850	1688



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ



ర్యాష్ డ్రైవ్ చేస్తూ స్పోర్ట్స్ బైక్‌తో పట్టుబడ్డ యువకుడు

పాఠశాల దశ నుంచే..



పాఠశాల దశ నుంచి విద్యార్థుల్లో ట్రాఫిక్ నియమావళిపై అవగాహన కలిగించాలి. అందుకు విద్యా సంస్థల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పాఠశాల యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం తాము తీసుకుంటున్న చర్యలన్నీ సఫలీకృతం అవుతున్నాయి. నగరవాసులు ట్రాఫిక్ నిబంధనల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. తద్వారా ప్రమాదాలు నివారించవచ్చు.

– ఎస్.రమేష్, సీఐ, ట్రాఫిక్-1

చట్టంలో కఠిన చర్యలు



ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టంలో కఠిన చర్యలకు ఆస్కారం ఉంది. ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కలిగిస్తూ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సెమినార్‌లు సత్ఫలితాలనిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు డ్రంక్ అండ్ డ్రైవ్, స్పీడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వల్ల కలిగే నష్టాలను వివరించాలి. మైనర్లకు బైక్‌లు ఇవ్వద్దు. స్పోర్ట్స్ బైకులు నడిపే క్రమంలో యాక్సిడెంట్‌లు ఎక్కువ అవుతున్నాయి. సదస్సుల ద్వారా హెల్మెట్ ధారణపైనా అవగాహన కల్పిస్తున్నాం.

– డీఎస్ చైతన్యకృష్ణ, సీఐ, ట్రాఫిక్-2

నగర సుందరీకరణకు సహకరించండి

- కార్పొరేట్ సంస్థలకు కమిషనర్ వినతి
- సానుకూలంగా స్పందించిన సంస్థలు
- త్వరలో మొక్కలు నాటు కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: నగర సుందరీకరణకు కార్పొరేట్ సంస్థలు తోడ్పాటు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓఎన్‌జీసీ, ఎన్‌ఎఫ్‌సీఎల్, కేఎస్‌పీఎల్ వంటి కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ సామర్లకోట రోడ్డు, అక్షర స్కూల్ రోడ్డు సహా పలు ప్రాంతాలలో రహదారులకు ఇరువైపులా ఇళ్ల లోని చెత్తను, చిరు వ్యాపారులు కొబ్బరి బొండాల వ్యర్థాలను వేస్తున్నారన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయన్నారు. ఇందువల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి దోమలకు నిలయంగా మారి వ్యాధులు ప్రబలే పరిస్థితి నెలకొంటోందన్నారు. ఇకపై అలాంటి ముఖ్య ప్రాంతాలలో చెత్తను డంప్ చేసే అవకాశం లేకుండా అక్కడ ఫెన్సింగ్ వేసి, మొక్కలు నాటి సుందరీకరించాలని సంకల్పిస్తున్నామన్నారు. ఇందుకు ఆయా కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్సార్ నిధుల ద్వారా అవసరమైన తోడ్పాటు అందించాలని కమిషనర్ కోరారు. కమిషనర్ ప్రతిపాదనపై సమావేశానికి హాజరైన ఆయా సంస్థల ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించారు. అలాగే ఆల్ ఈజ్ వెల్, ధరిత్రి వంటి సంస్థలు కూడా నగర వాతావరణాన్ని పచ్చదనంతో, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేలా మొక్కలు నాటే ప్రక్రియ లో భాగస్వాములు కావాలని కోరారు. త్వరలోనే మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి చేపట్టాల్సిన పనులపై ఆయా సంస్థల ప్రతిపాదనలను స్వీకరించి నగర సుందరీకరణ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ శిరిల్, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఆయా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి



పార్టీ నేతలతో చర్చిస్తున్న వంగా గీత

పిఠాపురం: ఈ నెల 8వ తేదీన నిర్వహించే దివంగత మాజీ సీఎం వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగి గీత ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ నెల 8వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా వైఎస్సార్ విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు.

రేపు మాదిగ జనజాతర

సామర్లకోట: ఉద్యమాల పురిటిగడ్డ ఈదుమూడులో ఆదివారం నిర్వహిస్తున్న మాదిగ జనజాతరను విజయవంతం చేయాలని మాదిగ సంఘ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని పిలుపు నిచ్చారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 1994 జూలై 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఈదుమూడులోనే ఏర్పడడంతో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని, మాదిగలు అందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి

- పారిశుధ్య సేవలకు సహకరించండి
- లేదంటే జరిమానా తప్పదు
- యజమానులకు కమిషనర్ సూచన

కాకినాడ: ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తను తక్షణమే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను కోరారు. సత్వర చర్యలు తీసుకోకుంటే జరిమానా విధించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుడారిగుంట, డి-మార్ట్, జయేంద్ర నగర్, లక్ష్మీ హాస్పిటల్ ప్రాంతాల్లో పూడిక తీత పనులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పూడికతీత పనులను రానున్న నెల రోజులూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని మెరుగైన పారిశుధ్య నిర్వహణకు నగరపాలక సంస్థ చేస్తున్న సేవలకు ప్రజలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొంతమంది నగరంలో ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, ఆ స్థలాలను నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆయా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, డంపింగ్ యార్డుల్లా, దోమలకు నిలయంగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటున్నాయన్నారు. అందువల్ల ఆయా స్థల యజమానులు తక్షణమే పరిశుభ్రం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఒకవేళ అలా పరిశుభ్రం చేసుకోలేని పక్షంలో తమ పారిశుధ్య విభాగాన్ని సంప్రదిస్తే స్థలాన్ని పరిశుభ్రం చేసేందుకు అయ్యే ఖర్చు వివరాలను తెలియజేస్తారని, ఆ సొమ్మును చలానా రూపంలో నగరపాలక సంస్థకు చెల్లిస్తే కార్పొరేషన్ పరంగా స్థలాలను పరిశుభ్రం చేస్తామన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉండే స్థలాలను కూడా ఎత్తు చేసి నీరు నిలువ ఉండకుండా చదును చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు స్థల యజమానులు సహకరించాలని, లేదంటే వారిపై పారిశుధ్య పరమైన చట్ట ఉల్లంఘన కింద నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, ఆయా సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

మధ్యాహ్న భోజనం భేష్

- విద్యాశాఖ ప్రభుత్వ పథకాల ఏడీ నాగేశ్వరరావు
- గురజనాపల్లి హైస్కూలులో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు వడ్డించి, సహపంక్తి భోజనం



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఏడీ నాగేశ్వరరావు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ప్రభుత్వ పథకాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పడాల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, నిల్వ, అమలు తీరును ఆయన తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించి, పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతపై ఆయన సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్ పెంచాలని ఉపాధ్యాయులకు, భోజన పథకం నిర్వాహకులకు ఆయన సూచనలిచ్చారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ వంటకాలను రుచిగా వండాలని, విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. అనంతరం ఏడీ నాగేశ్వరరావు మధ్యాహ్న భోజనపథకంలో పాల్గొనే విద్యార్థులకు వడ్డించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ నాగలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌తో మరింత సుస్తీ

- కొత్త ఓపీ పద్ధతితో రోగులకు అవస్థలు
- సుస్తీతోనే గంటల తరబడి నిరీక్షణ
- రోగులను వేధిస్తున్న సిబ్బంది కొరత

సామర్లకోట: తమకు వచ్చిన సుస్తీ కంటే ఆస్పత్రికి వెళ్లాక అక్కడ ఎదురవుతున్న పరిస్థితులు రోగులకు అదనపు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లిన దగ్గర నుంచి వైద్యుని వద్దకు వెళ్లే వరకు మధ్యలో ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేయించుకోడానికి నానా యాతన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్న నిబంధనతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగి తమ పేరు, ఆరోగ్య సమస్య వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వలన ప్రతి వ్యక్తికి సుమారు 10 నిమిషాలు పడుతోంది. దీనికి తోడు ఆన్‌లైన్ చేసే ఉద్యోగి కేవలం ఒకరు మాత్రమే ఉండడంతో సమస్యలు పెరిగిపోతున్నాయి. దాంతో రోగులు బారులు తీసి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆస్పత్రిలో సిబ్బంది కొరత వల్ల ఇటువంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆస్పత్రిలో సంపూర్ణంగా వైద్యులు ఉన్నా ఆస్పత్రికి వచ్చిన ప్రతీ రోగికి ఇబ్బంది తప్పడం లేదు. ఆయా కేసులకు సంబంధించిన వైద్యుల వద్దకు వెళ్లడానికి పూర్వపు మాదిరిగా చేతి రాతలో ఓపీ రాసి వైద్య పరీక్షలు పూర్తి అయిన తరువాత పుస్తకంలో నమోదు అయిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో సమస్యలు తప్పుతాయని రోగులు చెప్పున్నా వినే వారు లేరనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



పేర్ల నమోదు కోసం సామర్లకోట సీహెచ్‌సీ వద్ద బారులు తీరిన రోగులు

కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు అందజేస్తున్న ఆయిల్ ఇండియా ప్రతినిధులు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ఉమా మనో వికాస కేంద్రంలో ఆయిల్ ఇండియా సహకారంతో దివ్యాంగులకు శుక్రవారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్‌పీ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయిల్ ఇండియా సంస్థ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ కాకినాడ నుంచి రూ.4.83 విరాళంతో పాటు 36 మందికి ట్రైసైకిళ్లు, చెవిటి మెషీన్లు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయిల్ ఇండియా సంస్థ ఈడీ అంజన్ జ్యోతి ఫుఖాన్ మాట్లాడుతూ సీఆర్‌ఎస్ నిధులుతో తమ వంతుగా కృత్రిమ అవయవాలు అందించామన్నారు. ఉమా మనో వికాస కేంద్రం ఈడీ పెద్దిరెడ్డి మాట్లాడుతూ గోదావరి లేడీస్ క్లబ్ సెక్రటరీ మైత్రేయ భట్టాచార్య చొరవతో ఆయిల్ ఇండియా కంపెనీ తమ సంస్థ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఇండియా సంస్థ డ్రిల్లింగ్ సీజీఎం సంజీవ్ గొగొై, రాఖీ గొగొై, ఉమామనో వికాస కేంద్రం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో ప్రశ్నించేతత్వం పెరగాలి



ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి చేతులు ఎత్తిన విద్యార్థులు



విద్యార్థితో పాఠ్యపుస్తకంలో పాఠాన్ని చదివిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులలో ప్రశ్నించే తత్వం పెరిగేలా చూడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉండూరు శివారు ప్రకాశరావుపేట ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలకు వచ్చిన ప్రతీ విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వసతులను పరిశీలించారు.

చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలి

విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కాపవరంలోని ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థుల పుస్తకాలు, హాజరు శాతం, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.